క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోత్సాహకం

బి.కొత్తకోట : మండలంలోని గోళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మానవత సంస్థ ప్రతినిధులు ప్రోత్సాహక నగదును అందించారు. 567 మార్కులు పొందిన నరేంద్రకు రూ.3 వేలు, 540 మార్కులు పొందిన రాజేష్‌కు రూ.2వేలు, 527 మార్కులు పొందిన తనుశ్రీకి రూ.వెయ్యిని సంస్థ కన్వీనర్ రామచంద్రారెడ్డి సొంతంగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, కృష్ణారెడ్డి, కుమార్ రెడ్డి, మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

దూమ్రరూపంలో అమ్మవారు



దూమ్ర రూపంలో లలితత్రిపుర సుందరిదేవి

మదనపల్లె సిటీ : వారాహీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారు దూమ్ర రూపంలో అలంకరించారు. ఐదు ప్రమిదలతో ఎర్రవొత్తిదీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన బాల అయ్యప్పస్వామి ఆలయంలో గాయిత్రీదేవి అమ్మవారిని గంధం అలంకారంతో అలకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

319 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

పెద్దతిప్పసముద్రం : ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో పండ్ల తోటల పెంపకం పనులు చేపట్టినట్లు ఎంపీడీఓ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా మండలంలోని 175 మంది రైతులకు చెందిన 319 ఎకరాల్లో మామిడి, అల్లనేరేడు, చీనీ, సపోటా, దానిమ్మ, నిమ్మ లాంటి పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారని తెలిపారు.

పశుగ్రాస పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏడీ శ్రీధర్‌రెడ్డి

కురబలకోట : పశుగ్రాస పథకాలను పాడి రైతులు వినియోగించుకుని పాల ఉత్పత్తులు పెంచుకోవాలని పశుసంవర్ధక శాఖ అంగళ్లు ఏడీ శ్రీధర్ రెడ్డి కోరారు. మండల పశు వైద్యాధికారి సౌజన్య ఆధ్వర్యంలో అంగళ్లులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయితీతో ఇచ్చే గడ్డి గింజలు, పశుగ్రాస విత్తనాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పచ్చి మేత వల్ల అధిక పాల ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. ఈనెల15 వరకు వారోత్సవాలు కొనసాగుతాయన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామసముద్రం : మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి ఆధ్వర్యంలో జయతేశ్రీ ఏజెన్సీ మల్లికార్జున నాయుడు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 70 మందికి వైద్యులు వివిధ రకాల జబ్బులకు పరీక్షలు చేశారు. కిడ్ని , గుండె, క్యాన్సర్ , బిపి, షుగర్, ఎముకలు, నరాలు తదితర వాటికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లుకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడి అనంత కిషన్, డాక్టర్లు ప్రవీన్, ప్రఫుల్, నర్సింగ్ ఆఫీసర్లు సురేష్, లోకేష్, భరణి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు




మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ప్రయాణికుల సౌకర్యం కోసం హైదరాబాద్‌కు కొత్త బస్సు సర్వీసు ప్రారంభించినట్లు ఆర్టీసీ -1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరబాద్ సర్వీసుకు వెళ్లే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మదనపల్లె డిపో నుంచి ప్రతి రోజు రాత్రి 8 గంటలకు కొత్త సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి మదనపల్లెకు ప్రతి రోజు రాత్రి 8.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

వందరోజుల గృహలక్ష్యం

- గత ప్రభుత్వం చేపట్టిన పక్కా గృహ నిర్మాణాల్లో 21,531 పూర్తి చేయాలని నిర్ణయం
- గృహ నిర్మాణశాఖకు ఆదేశాలు



బి.కొత్తకోట కురవానికుంట లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు కార్యక్రమం ద్వారా పేదలకు మంజూరు చేసిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గృహ నిర్మాణశాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. వంద రోజుల్లో జిల్లాలో 21,831 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలోని పేదలకు గత ప్రభుత్వం ఇంటి నివేశ స్థలాలతోపాటు పక్కాగృహలను మంజూరు చేసింది. ఈ స్థలాల్లో పేదలు పక్కా గృహ నిర్మాణాలు చేపట్టి పనులు చేసుకొంటున్నారు. లేఅవుట్లలో ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులకు సౌకర్యాలను కల్పించారు. నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పించి లేఔట్లను నిర్మాణాలకు అనువుగా సిద్ధం చేశారు. మంజూరైన ఇళ్లలో 75,619 పక్కా గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యి, వివిధ దశల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పురోగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాల్లో సత్వరమే పూర్తి చేయాల్సిన, ఏ స్థాయిలో ఉన్న నిర్మాణం ఏ స్థాయికి పెంచాలి అన్న దానిపై స్థాయి వారీగా ఇళ్ల లక్ష్యం, పూర్తి చేయాల్సిన ఇళ్ల లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించగా వాటి వివరాలను ఆయా జిల్లా గృహనిర్మాణశాఖలకు పంపింది. దీనితో వచ్చే వందరోజుల్లో పూర్తిచేయాల్సిన స్థాయి వారీగా ఇళ్ల నిర్మాణాల సంఖ్య ఇదే.

బీబీఎల్ నుంచి బీఎల్	– 1,138
బీఎల్ నుంచి ఎల్ఎల్	– 4,894
బీఎల్ నుంచి ఆర్ఎల్	– 4,894
ఎల్ఎల్ నుంచి ఆర్‌సీ	– 857
ఆర్ఎల్ నుంచి ఆర్‌సీ	– 6,026
ఆర్‌సీ నుంచి పూర్తి	– 4,865
మొత్తం	– 21,536

జాతీయ బీసీ చైతన్య సమితి అధికార ప్రతినిధిగా సహజీవన్‌బాబు



సహజీవన్‌బాబు

మదనపల్లె : జాతీయ బీసీ చైతన్య సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ సహజీవన్‌బాబును నియమిస్తూ జాతీయ అధ్యక్షులు బత్తుల రమణయ్య నియామక పత్రం అందజేశారు. మంగళవారం నిమ్మనపల్లె సర్కిల్ మాజీ సైనికుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జాతీయ బీసీ చైతన్యసమితి జాతీయ అధ్యక్షులు బత్తుల రమణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బీసీల స్థితిగతుల్లో మార్పు రావడం లేదని, బీసీల్లో చైతన్యం తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కమిటీలు వేస్తున్నామన్నారు. బీసీల్లో చైతన్యం తెచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సహజీవన్‌బాబు మాట్లాడుతూ. బీసీ హక్కుల సాధనకు కులగణన ఒకటే పరిష్కారమని, దాన్ని సాధించేంతవరకు బీసీ చైతన్యసమితి పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. మాజీ సైనికుల గౌరవాధ్యక్షులు కంచర్లశ్రీనివాసులునాయుడు, మాజీ కౌన్సిలర్‌లు రాజాశ్యాం, బాబ్జీ, వాల్మీకిసంఘం నాయకులు లక్ష్మీనారాయణ, మేదరసంఘం వెంకటనారాయణ, ముస్లిం నాయకులు హమీద్, సయ్యద్, మున్సిపల్ కాంట్రాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి సామగ్రి నిల్వపై నివేదిక

బి.కొత్తకోట : గృహనిర్మాణశాఖ గోదాముల్లో నిల్వ ఉన్న ఇంటి నిర్మాణ సామగ్రిపై జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని గోదాముల్లో సిమెంటు, కమ్మి, తలుపులు, కిటికీలు, ఇతరా సామగ్రి లబ్ధిదారులకు పంపిణీ చేయగా నిల్వ ఉన్న వివరాలను పంపినట్లు చెప్పారు. వందరోజుల్లో 3,191 ఇంటి నిర్మాణాల స్థాయి పెంపునకు లక్ష్యాలను నిర్దేశించగా వాటి పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లబ్ధిదారులు నిర్మించకునే ఇళ్లకు సత్వరమే బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. నిర్మాణాల పూర్తికి దృష్టి పెట్టామని తెలిపారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

రామసముద్రం : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 76 ఆవిర్భావ దినోత్సవం మంగళవారం రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అలాగే విద్యార్థి పరిషత్ నాయకులు జిల్లా ఉన్నత పాఠశాలలో సెమినార్ నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఏబీవీపీ సిద్ధాంతాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి సి.చంద్రశేఖర్, హేమంత్, రెడ్డి, నవీన్, పవన్ పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులు విద్యలో రాణించాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మైనారిటీ విద్యార్థులు విద్యలో రాణించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలుచేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డింపులో నాణ్యతతో కూడిన వస్తువులనే వినియోగించాలని, ఆహారం విషయంలో రాజీ పడవద్దని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, నాదెళ్ల విద్యాసాగర్, ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం షాజహాన్, పఠాన్ మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



షాహీదా

ములకలచెరువు : మండలంలోని కదిరినాయునికోట పంచాయతీ నాయనవారిపల్లికి చెందిన షాహీదా రాష్ట్ర స్థాయిలో జరిగిన వాలీబాల్ చాంపియన్ పోటీల్లో సత్తా చాటినట్లు వాలీబాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లా నందిగామాలో ఈ నెల 6, 7 తేల్లో జరిగిన సీనియర్ బాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో సీనియర్స్ ఉమెన్ ఓపెన్ కెటగిరీ ద్వారా షాహీదా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. దాతలు యువతికి ఆర్థికంగా సహాయం అందజేస్తే జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుతుందని జిల్లా కార్యదర్శి షబ్బీర్ పేర్కొన్నారు.

2000 లీటర్ల సారా ఊట ధ్వంసం




సారా డ్రమ్ములు, నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద అటవీ ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 2000 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ శ్యాం ప్రసాద్ తెలిపారు. మంగళవారం పీలేరు సెబ్, రాయచోటి స్పెషల్ టీం జిల్లేళ్లమంద సమీపంలోని అటవీ ప్రాంతంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీ చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి డ్రమ్ములు, పాత్రలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో సెబ్ ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది శేఖర్, సుధాకర, సురేష్, రమేష్, చందు, నాగేంద్ర, శివసుదర్శన్‌రావు, సునీల్ సుకుమార్, వేణు పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మండలంలోని కోటవారిపల్లె పంచాయతీ నడిమితాండాలో సారా విక్రయాలు అందుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి దాడిచేశారన్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న కృష్ణానాయక్ భార్య బుక్కేలక్ష్మమ్మ(58)ను అరెస్ట్‌చేసి ఆమె నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'ఈ ఆరుగురికి బీసీజీ టీకా తప్పనిసరి'



కురబలకోటలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కురబలకోట : ఆరు వర్గాలకు చెందిన వారు బీసీజీ టీకాను తప్పనిసరిగా వేసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు ప్రభాకర్ అన్నారు. మంగళవారం వారు మండలంలోని బీసీ, ఎస్సీ కాలనీ, తెట్టు, నందిరెడ్డిగారిపల్లెల్లో బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ టీబీ లేని సమాజం కోసం పెద్దల కోసం బీసీజీ టీకాలు ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. అరవై ఏళ్లు పైబడిన వారు, షుగర్ ఉన్నవారు, ఎత్తుకు తగిన బరువు లేని టీబీ రోగులు, బీడీ, సిగరెట్, మద్యం అలవాటున్న వారు, టీబీ బాగైన వారు, టీబీ రోగులకు సన్నిహితంగా ఉన్నవారు విధిగా టీకాను వేసుకోవాలన్నారు. ప్రతి సోమ, గురువారాల్లో బీసీజీ టీకాను ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా కనకదుర్గమ్మ గంగజాతర



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ

రామసముద్రం : రామసముద్రం నగర్‌లో కొలువైన శ్రీకనకదుర్గమ్మ గంగజాతర మంగళవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే జాతరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. ఉదయం అర్చకులు అనిల్, శివ, రాజేష్‌లు ఘనంగా కలశారాధన చేశారు. నూతన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొచ్చి వేద పడింతులు వేంద్రమంత్రాలతో పంచామృతాభిషేకాలు చేశారు. జాతర సందర్భంగా బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది. రాత్రికి అమ్మవారిని ఘనంగా ఊరేగించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

రామసముద్రం : అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించి గ్రామాల్లో తిరగకుండా కాలయాపన చేస్తే వేటు తప్పదని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, రెవెన్యూ , వ్యవసాయం , విద్యుత్ సమస్యల పట్ల దృష్టి సారించాలన్నారు. రైతే రాజని, అలాంటి రైతుల పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. గ్రామాల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నెలలోపు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి నెలా 200 మంది రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు అందజేయాలన్నారు. అధికారులు గతంలో ఉన్నట్లు ఉంటే సస్పెండ్ చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ భానుప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

తల్లికి వందనం ప్రైవేటు పాఠశాలలకు వర్తింపజేయాలని వినతి



ఆర్‌జేడీకి ఏసుక్రీస్తు చిత్రపటాన్ని అందజేస్తున్న సేతు

మదనపల్లె సిటీ : తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రైవేటు పాఠశాలలకు వర్తింపజేయాలని ప్రైవేటు పాఠశాలల సంఘ నాయకులు, విజయభారతి స్కూల్ కరస్పాండెట్ విద్యాశాఖ ఆర్‌జేడీ శ్యాముల్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆర్‌జేడీని మర్యాదపూర్వకంగా కలిశారు. తల్లికి వందనం ప్రైవేటు పాఠశాలకు వర్తింపజేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఆయన్ను కలిసివారిలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డిశేఖర్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

తంబళ్లపల్లె : మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలు అధికంగా సాగు చేసేందుకు మండల టెక్నికల్ ఫీల్డ్ అస్టింటెట్లు కృషి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పరిధిలో 5 ఎకరాల లోపు సన్నకారు రైతులకు పండ్ల తోటలు, పాడి రైతులు పశుగ్రాసం పెంచుకునేందుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఏపీఓ అంజనప్ప మాట్లాడుతూ ఎకరాలో 70 మామిడి మొక్కలు నాటితే వాటి సంరక్షణ కోసం మూడేళ్లలో రూ. 99,911, ఎకరాలో 60 టెంకాయ మొక్కలు నాటుకుంటే రూ.88,300 ఎకరాలో 40 అల్లనేరేడు మొక్కలు నాటుకుంటే రూ.61 వేలు, అదే విధంగా పాడి రైతులు ఎకరాలో పశుగ్రాసం నాటుకుంటే రెండు సంవత్సరాల్లో రూ.40 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటితో పాటు పూల మొక్కల సాగు, రైతుల పొలాల్లో గట్లు నిర్మాణం, ఫాం పాండ్ల నిర్మాణం చేపట్టవచ్చునన్నారు. రైతులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధి ఇంజినీర్ రామన్న, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శాఖాహారంతో ఆరోగ్యం, ఆధ్యాత్మికం



పీలేరులో ర్యాలీ చేస్తున్న పిరమిడ్ మాస్టర్లు

పీలేరు రూరల్ : శాఖాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం, ఆధ్మాత్మిక సంపద లభిస్తుందని కొటాల జేతవనం పిరమిడ్ సొసైటీ ముఖ్య కారకుడు మాస్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలో కొట జేతవనం పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో సుమారుడ 800 మంది పిరమిడ్ మాస్టర్లు శాఖాహార సద్భావన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఆధ్యాత్మిక సంపద, సనాతన సంపద ఒకే ఒక్క మాట మానవుని ఆహారం శాఖాహారం మాత్రమేనని తెలిపారు. అయితే మనం విదేశీయుల ప్రలోభాలతో జంతురుచులకు మాంసభక్షణ మొదలు పెట్టి జీవులన్నీ మనకోసమే పుట్టాయనే ఒక అపోహలో జీవిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు బాలాజి పిప్పళ్ల ప్రసాదరావు, గణేష్, సతీష్, ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి వివిధ పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలి



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : గర్భిణులు ఆరోగ్య మెలకువలు పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సురక్షిత మాతృత్వం కోసం ప్రతి గర్భిణీ నిర్దేశించిన రోజుల్లో ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఆరోగ్యకర సంతతి కోసం ప్రాథమిక ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ అందించే ఆరోగ్య పథకాలు, మెరుగైన సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఐరన్ పోలిక్ యాసిడ్, ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎంలు నాగవేణి, ఫామున్నిషా, సీహెచ్‌వో కుముద, లావణ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం



కలకడ : రక్తపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



పీలేరు : గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కలకడ : ప్రభుత్వ ఆసుపత్రిలోనే సుఖప్రసవం–తల్లిబిడ్డ క్షేమమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వఅభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య ఉపకేంద్రాల వారు గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, ఐరన్, సుక్రోజ్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. 42మంది గర్భిణులకుగాను 12 మందిని హైరిస్క్ ఉన్నట్లు గుర్తించి ఉన్నత ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత ప్రసవం

పీలేరు రూరల్ : ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవం సాధ్యమని డాక్టర్ కార్తీక్‌కుమార్, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ శైలజ అన్నారు. మంగళవారం మండలంలోని రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు, కాల్షియం , విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ రమాదేవి, చిన్నప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు దగ్గరున్న విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది అభ్యర్థులు హాజరయ్యారు. డిసైన్ ప్రో సొల్యూషన్స్‌కు 23, టాటా మోటార్స్ 6, క్యూబిక్ కంట్రోల్ 4, క్యూబిక్ లర్నింగ్ 7,ప్యూజన్ సిఎక్స్ 10, ఎయిర్ టెల్ 18, ఎన్టెక్ 20, క్వెస్కాబ్ 8, ఇనోవా సోర్స్ 7, కేరియర్ 15,యంగ్ ఇండియా 6, జె వైసాప్టెవేర్ సొల్యూషన్స్ 22, పేటీఎం 5, ఎఎస్ఎస్ 16 తదితర కంపెనీలకు 214 మంది దాకా ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

రాయచోటి అర్బన్ : పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. మంగళవారం ఆయన మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి తనయుడు రాహుల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలసి పలు వార్డులలో పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సమస్య తదితరాలను పరిశీలించారు. పట్టణంలోని పలు వార్డులలో నెలకొన్న సమస్యలపై వారు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 16వ వార్డులో తాగునీటి సమస్య గురించి తెలుసుకుని, వెంటనే సమస్యను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. 9వ వార్డులోని అలీమాబాద్ వీధిలో పైపులైన్ లీకేజీ, కాలువల్లో పూడికతీత, శానిటేషన్ సమస్యలను పరిశీలించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ పారిశుద్ధ్య, తాగునీటి విభాగం అధికారులను ఆదేశించారు. పురప్రజలు తమ ఇళ్లలోని చెత్తను మురుగు నీటి కాలువలు, ఖాళీ స్థలాలలో వేయకుండా చెత్తబండ్ల సేకరణ సిబ్బందికి అందజేయాలని కోరారు.

10న ధర్నాను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాల అమలుకు నిరసనగా అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఈ నెల 10వ తేదీన నిర్వహింప తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, రామాంజులు తెలిపారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడం ద్వారా కార్మిక హక్కులను కాలరాయాలని చూస్తోందన్నారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకింగ్, డిపెన్స్, రైల్వే, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, రోడ్లు తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే యత్నాలు చేస్తుండటం దారుణమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు విక్రయించడమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు.